# గడ్డిపువ్వు



ఆశ్చర్యమో, అనుభూతో, దిగ్భ్రాంతో తెలియని స్థితి.

ఇలాంటి విచిత్రమైన స్థితికి నేను అరుదుగా లోన య్యాను.

ఉదయం ఇటునుండే వచ్చాను. అప్పటికే ఉందా? ఉండే ఉంటుంది.

నా దృష్టి అటుపడి ఉండదు. అందులోనూ ఆఫీస్ కి వెళ్ళే హడావుడి.

అయినా నేనొక్కదాన్నేనా ఈ దారివెంట నడుస్తోంది! ఒకరూ, ఇద్దరూ కాదు. కొన్ని వందల మంది. మరి ఎవరి దృష్టికి సోకకుండా ఎలా మనగలిగింది?

అద్భుతమే!

మా ఊరికి వెళ్ళాలంటే ఈ రైల్వే లైను దాటాల్సిందే. మొత్తం ఆరు వరసలు. స్టేష నుకీ, ఊరి చివరి గేటుకీ నడుమ ఈ దారి ఉంది. నడిచి వెళ్ళేవారే కాదు సైకిళ్ళ వారు కూడా ఈ అడ్డదారిన రావాల్సిందే. కిలో మీటరు దూరం నడవటం ఇబ్బందికరమే. ముందు త్వరగా వెళ్ళాలనే కోరిక అందరినీ లోబరచుకుంటుంది.

అందుకే పరుగులు. పట్టాల నడుమ కంక రరాళ్ళు. ఎంత జాగ్రత్తగా నడిచినా ఎన్నిసార్లు పాదాల నుండి రక్తం చిందిందో! పట్టాల నడుమే కొంత ఖాళీ ప్రదేశం. ఆ చివరా, ఈ చివరా కొద్దిపాటి పచ్చగడ్డి పెరిగింది.

రాగానే ముందు రెండు పక్కలా చూడాలి. సిగ్నల్ లైట్ చూడాలి. ఇదివరకటిలా కాదు.

ఈ లైన్ని విద్యుదీకరించారు. మరింత ఆధు నికం చేశారు. రైళ్ళ వేగం పెంచారు. అందుకే దూరంగా చుక్కలా కనిపిస్తుంది. కొద్ది క్షణాల తర్వాత కళ్ళ ముందుకు దూసుకొ స్తుంది. దాటి వెళ్తున్నప్పుడు ప్రళయ ఘోష వినిపిస్తుంది.

ఆ శబ్దం ఎప్పుడు తలుచుకున్నా భయంక రంగానే ఉంటుంది.

మరోసారి పరీక్షగా చూశాను.

ఆశ్చర్యమే!

ఇప్పటి వరకు పనిచేసి అలసిపోయానా కద లాలనిపించటం లేదు.

అలానే చూస్తుంటే కాలం కరిగిపోదూ!

ఎదురుగా పట్టాలమీద గూడ్స్ బండి ఆగి ఉంది. రెండు రోజులకోసారయినా ఈ బాధ తప్పదు. దేశ జనాభాలా అది ఎటు మొదలై, ఎటు అంతమవుతుందో తెలియదు. ఆగుతుందో, కదులుతుందో తెలియదు. గేటు దాకా నడవాలంటే ఓపిక ఉండదు. అలా అని క్రింద నుండి దూరి వెళ్దామా అంటే భయం. అప్పుడే కదిలితే!

నిరీక్షణ. ఎప్పటికో కదులుతుంది. లేదా దీర్ఘంగా నడక తప్పదు. తెగించి దూరి వెళ్ళ టమూ తప్పదు.

అలాంటి చోట...

వందలాది మంది తిరిగే దారిలో...

ఆ రాళ్ళ నడుమ నుండి ఎప్పుడు పుట్టిందో తెలియదు. ఎలా విచ్చుకుందో తెలియదు.

అసలలా అంత సుందరంగా ఎలా నవ్వగ లుగుతుందో తెలియదు...

ఎవరో అతి జాగ్రత్తగా రాళ్ళకూ పట్టాలకూ నడుమ అమర్చినట్టుగా ప్రకాశిస్తోంది.

పువ్వు...గడ్డిపువ్వు!

ఎన్నిసార్లు గడ్డిపూలని చూడలేదు. ఇంత తన్మయత్వం ఎప్పుడైనా కలిగిందా? కనీసం దానినో పువ్వుగా గుర్తించానా? మరి ఇప్పుడు ఈ కర్కశ ఇనప పాదాలక్రింద తలెత్తిన ధైర్యా నికి కలుగుతున్న విభ్రాంతా ఇది!

ఈ దారిలోనే ఎందరో పిల్లలు, ఎందరెందరో యువతీ యువకులు ఇంకా అన్ని రకాల వయసుల వారూ–ఈసారికి చూసి ఉంటే ఓ క్షణం ఇలానే చూసి త్రుంచేవారేమో!

అది గడ్డిపువ్వు. దాన్నుండి అపురూప పరిమళం తాకదు. ఆ రంగులోనూ చెప్పుకో దగిన విశేషం లేదు. ఏ రకంగా చూసినా పువ్వులోని లాలిత్యం కనపడదు. అలాంటి మొరటుది కాబట్టే గడ్డిపువ్వు అన్నారేమో! ఆ గడ్డిపువ్వు సైతం ఇంత అందంగా కనిపించ టానికి కారణం అక్కడ నిలబడటమేనేమో.

ఇంటికి వెళ్ళాలి. వెళ్ళాలనిపించడం లేదు. దూరంగా...అవును. భూమి ప్రకంపిస్తోంది. మృత్యువులా దూసుకొస్తోంది బండి...కళ్ళ ముందు నుండే అవును. మృత్యువే. మృత్యు వుకి ఇలాంటి బీభత్స సంగీతమే కావాలి. కళ్ళు తెరిస్తే బండెళ్లి పోయింది. కందిపోయిందా పువ్వు ఆహా! ఎంతటి ధైర్యం...తలమీదుగా ప్రళయాన్ని అనుభూతిచెంది ఎలా నవ్వగలు గుతోంది!

రాత్రంతా ఇక్కడ నిలబడితే వెన్నెలొస్తుంది. వెన్నెల్లోనూ మృత్యు శకటాలు ఆగవు. నిరంతరం పరుగులు తీయాల్సిందే. రాష్ట్రాల్నీ, భాషల్నీ, నదుల్నీ సమస్తాన్నీ కలుపుకుంటూ సజీవ సంబంధాల్ని బలోపేతం చేయాల్సిందే. అదేమిటో ఇంతటి మహత్తర బాధ్యతను నిర్వహించే ఈ పట్టాలు ఎంత కర్కశమైనవి!

ఒకరిద్దరు ఆగి చూస్తున్నారు. నేను దేనికోసమో వెతుకుతున్నాననుకుంటున్నారు. అంతలోనే కదిలి వెళ్ళిపోయారు. నన్ను ఇలా కట్టిపడవేసిన ఆ పువ్వుని కోసుకుంటేనో...కోసుకుని ఏం చేయాలి? తలలో పెట్టుకోటానికి రాదు. ఆ వాసనను భరించలేం. అలా ఉంచితేనే బాగుంటుంది.

నిజమే. కానీ ఎవరో ఒకరు చూస్తారు. వారు అలా వుంచరు. ఆ పువ్వుని తుంచేస్తారు. రేపటికి తను ఉండదు. అదొక్కటే నిజం.

అయినా ఆ పని నేనెందుకు చేయాలి?

ఎంతసేపు అస్థిత్వంలో ఉంటేనేం...అలానే తీవిగా ఉండాలి. ఏమో రేపు సైతం ఇలానే ఉంటుందేమో!

ఎందుకో ఆ గడ్డిపువ్వుని ఓసారి స్పృశించాలనిపించింది.

అటూ ఇటూ చూశాను. మనుషులెవరూ లేరు. మెల్లగా వంగి, మోకాళ్ళ మీద కూర్చున్నాను. ఆ గడ్డిపువ్వుని చేతుల్లోకి తీసుకున్నాను.

"నేను వెళ్తాను. నువ్వు ఎవరి కంట్లోనూ పడకుండా రేపటి దాకా మనగలగాలి. ఉదయమే నీ కోసం పరుగులు తీసుకుంటూ వస్తాను."

తిరిగి గడ్డిపువ్వు ఆ పట్టాల క్రింద...నేను ముందుకు కదిలాను. మనసునిండా ఆ పువ్వు తళతళలే!

ఎంతకీ నిద్ర పట్టదు.

ఇన్ని సంవత్సరాలుగా ఆ పట్టాల నదుమే ప్రయాణం. ఎప్పుడూ భయానకమే. ఇంటికి వచ్చేదాకా ప్రతి క్షణమూ ఆందోళనే. ఈ పట్టాలమీదే ఎందరెందరో అభాగ్యులు తమ జీవితాల్ని అర్పించారు.

ఉద్యోగాలు రానివారు, పెళ్ళిళ్ళు కాని ఆడపిల్లలు, సంసారంలో కష్టాలు భరించలేనివారు,

**కాజోల్ 'లవ్'**

రాజీవ్ మీనన్ పాత్రకు ఎంపికైన వర్ధమాన నాయిక 'కాజోల్' రేటు ఎంతో తెల్సాండీ? 41 లక్షల రూపాయిలు... ఔను. అక్షరాలా నలభై ఒక్క లక్షలు మాత్రమే. ప్రభుదేవా, అరవింద్ స్వామి నటించే 'ప్రేమ్ కహానీ'లో తొలుత మాధురీదీక్షిత్‌ను బుక్ చేశారు. కానీ కాల్షీట్స్ కుదరక ఆమె తప్పకుంది... అంతే కాజోల్ పంట పండింది!



— 'సత్యశ్రీ'

ఒకరా, ఇద్దరా ఎందరెందరో ఈ పట్టాల మీదే రోదిస్తూ, తమ నిస్సహాయతను ప్రపంచానికి చాటారు.

ప్రతిసారీ ఏదో వార్త. పట్టాలు దాటుతుంటే అనుభూతి కలగదు. అవి మానవజాతి ప్రగతికి సంకేతంలా కనిపించవు. ఎందరో రోదిస్తుంటారు. ఇవి ఆత్మహత్యల కేంద్రాలు. హత్యల వాకిళ్ళు.

ఏకకాలంలో మనిషి సాధించిన ప్రగతికీ, అధోగతికీ సాక్ష్యాలు...అలాంటి చోటులో...

ఎందుకీ గడ్డిపువ్వు!

ఎంత చిత్రమైందీ జీవితం!

ఉదయం...

త్వర త్వరగా పరుగులు తీసుకుంటూ వచ్చాను.

నా పిచ్చిగానీ-ఇంకా ఆ పువ్వు అక్కడ ఉంటుందా!

ఎదురుగా...

రెండు లైన్ల మీదా గుడ్స్ బళ్ళు.

ఎంత దూరం నడవాలో తెలియదు. ఇంజన్ ఎటుందో కనిపించటం లేదు. సిగ్నల్‌కేసి చూశాను. ఓ పక్క మాత్రం రెడ్ లైట్ కనిపిస్తోంది.

కొద్దిసేపు నిలబడ్డాను.

కాలం వేగంగా పరుగులు తీస్తోంది.

ఇంక ఉండటం నావల్ల కాలేదు.

ధైర్యం చేశాను.

వాటి నుండి వస్తుంటే ఎందుకో తెలీని భయం...

గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ఒక్కసారిగా మృత్యు సంగీతం తలపుకొచ్చింది.

ఆగిపోయాను. కాళ్ళు కదలనంటున్నాయి. ఇదేమిటి...ఇప్పుడు బండి కదిలితే...ఇంకేమైనా ఉందా? నేను సైతం...అయ్యో...ఇప్పుడెలా? శక్తులన్నింటినీ కూడదీసుకుంటే...అమ్మయ్య... చల్లగాలి తగిలింది. గండం గడిచింది. ఇప్పుడింక ఆ గడ్డిపువ్వుని చూడాలి!

"ఏం ఆడదానివమ్మా...బండి కింది నుండి దూరొచ్చావ్. అంత కష్టమేం వచ్చింది. నాలుగడుగులు వెయ్యలేక పోయావా?" ఎదురుగా ఉన్న ముసలాయన కోప్పడ్డాడు.

నాకు ఒక్కసారిగా ఆగ్రహం ముంచుకొచ్చింది.

అతను ఇంకా ఏదో అంటూనే ఉన్నాడు. మెల్లగా చెబితే వేరే విషయం. అయినా, నా జీవితం నా ఇష్టం. అంతగా అయితే ఛస్తాను. అతని కెందుకట...నేనూ ఏదో ఒకటి అందామనుకుంటుండగా అన్నాడు కోపంగా...

"ఏంటలా చూస్తావ్. ఏమైందో తెలుసా? ఆ పట్టాలకింద గడ్డిపువ్వు పూసిందంట. దాన్ని చూస్తూ కూచుందో పిల్ల. ఏం పిల్లో...సెపంచాన్ని మర్చిపోతే ఎట్టా? అంత వేగంగా వచ్చి కొడితే...గాల్లోకి లేచి ముక్కలు ముక్కలై ఆనవాళ్ళు లేకుండా... "

నాకింకేం వినిపించటం లేదు
మృత్యు సంగీతం తప్ప
నేనలా స్తంభించాను
భయమో, నేరమో, గగుర్పాటో మరో భావమో
తెలియని స్థితి. నన్ను కబళించింది.

పి. చంద్రశేఖర్ అజాద్